క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : పెందుర్తి మండలం గొరపల్లి పంచాయతీకి చెందిన బి.సుబ్బాలక్ష్మికి రూ.1.7 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శనివారం అందజేశారు. రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చెక్కు అందజేశారు. కార్యక్రమంలో గొరపల్లి సర్పంచ్ గొరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 వరకు కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను మండపం పైకి వేంజేపచేశారు. విశ్వక్సేణపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యులు తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ సునీల్‌కు చెక్కు అందజేస్తున్న రాంబాబు కుటుంబీకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం లక్ష రూపాయల విరాళాన్ని నగరంలోని గాజువాక దరి బీసీ రోడ్డు ప్రాంతానికి చెందిన వి.రాంబాబు అందజేశారు. సింహగిరిపై స్వామి దర్శనం కోసం శనివారం వచ్చిన రాంబాబు కుటుంబ సభ్యులు సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో మే ఐ హెల్ప్ యూ కేంద్రంలో సూపరింటెండెంట్ సునీల్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దొడ్డి రమణ, పీఆర్‌వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న కుట్రతో ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుందన్నారు. 2021 జనవరిలో కేంద్రం నిర్ణయం తీసుకున్న నాటి నుంచి ఉద్యమం చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు. హోంమంత్రి అమిత్ షా విశాఖ పర్యటనలో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. విశాఖ పర్యటనలో అమిత్‌షాను కలిసేందుకు అవకాశం ఇవ్వాలని కలెక్టర్, పోలీసు కమిషనర్, బీజేపీ ఎంపీ, నాయకులను కలిసి అభ్యర్థించామన్నారు. ఆదివారం ఉదయం కూర్మన్నపాలెం దీక్షా శిబిరానికి ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, ప్రభాకరరెడ్డి, టీఎంకె నాయక్, కొమ్ము ప్రసాద్, గంగవరం గోపీ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ధ్యేయంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 97వ వార్డు 508వ నంబరు సచివాలయం పరిధిలోని అశోక్‌నగర్, విద్యానగర్, మాధవ టవర్స్ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. అర్హులైనప్పటికీ పథకాలు అందకపోతే... సాంకేతిక సమస్యలు పరిష్కరించి పథకాలు అందేలా చూడాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్, విశాఖ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాపర్తి వాసు, సందీప్, రాజు, రాంబాబు, మాధవి, శేఖర్, యూసీడీ ఏపీడీ శ్రీరామ్, వాటర్ వర్క్స్ ఏఈ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



సబ్బవరం గ్రంథాలయంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



అడవివరం గ్రంథాలయంలో విద్యార్థులతో క్రీడలు ఆడిస్తున్న ఆర్పీ రాజేంద్రప్రసాద్

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. గ్రంథాలయాధికారి వి.శిరీష ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు పుస్తక పఠనం, పేపర్ చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కోలాట పోటీల్లో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ పోటీల్లో విజేతలకు శిబిరం ముగింపురోజున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు.

అడవివరం గ్రంథాలయంలో..

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు శనివారం పుస్తక స్వీయ పఠనం, క్రీడల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. గ్రంథాలయ రిసోర్స్ పర్సన్ బి.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. చిన్నప్పటి నుంచి ప్రతీ ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ధ్యానం చేయించి, ధ్యానం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, కార్మికనేత సి.హెచ్.సూర్యనారాయణ రాజు, పాఠకులు వర్మ, కిరణ్ పుష్ప, న్యాయవాది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



మృతురాలు లంకి సోములమ్మ

కూర్మన్నపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వెంకన్న మర్రిపాలెం ప్రాంతానికి చెందిన లంకి సోములమ్మ(65) కూరగాయల వ్యాపారం చేస్తుంటుంది. ఈ క్రమంలో నగరంలో కూరగాయలు కొనేందుకు వెళ్తుండగా అగనంపూడి దరి ఏడుమెట్ల మర్రిపాలెం వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఆమె మేనల్లుడు బలిరెడ్డి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత



సర్పంచ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పరవాడ: నాయుడుపాలెం శివారు హనుమాన్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు రూ.10,116 విరాళంగా అందజేశారు. అలాగే రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు రూ.10,116, గొర్లివానిపాలెం వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లి శ్రీనివాసరావు రూ.5,116 విరాళంగా శనివారం అందజేశారు. సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి, ఈరుగుల లక్ష్మిప్రసాద్, ఎస్.సోమేశ్వరరావు, లాలం అప్పలనాయుడు, ఎస్.అప్పారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయాల నిర్మాణానికి స్థలాల పరిశీలన



రామవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ధర్మ ప్రచార పరిషత్ అధికారులు

ఎంవీపీకాలనీ: గ్రామీణ నియోజకవర్గాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణాలకు సంబంధించి పలు చోట్ల హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులు స్థలాలను పరిశీలించారు. భీమిలి నియోజకవర్గంతోపాటు పలు నియోజకవర్గాల్లో శనివారం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెంట్ ఎస్‌కేసీఎం శర్మ మాట్లాడుతూ గ్రామీణ నియోజకవర్గాల్లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయా గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా భీమిలి నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించి స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, హెచ్‌డీపీ సిబ్బంది పాల్గొన్నారు.

చేతివృత్తులతో ఆర్థిక స్వావలంబన

- దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు తర్ఫీదు





శిక్షణ అనంతరం తయారుచేసిన పటియాలా, గౌనులతో విద్యార్థినులు



టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్

ఆరిలోవ : చేతి వృత్తుల్లో యువతకు శిక్షణ అందించి వారి జీవనోపాధికి తోడ్పడుతోంది దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం నగరంలో ఓ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా శిక్షణ పొందుతున్నారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ వర్సిటీ ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్నారు. యువతకు పలు రకాల చేతి వృత్తుల్లో కొన్నేళ్లుగా శిక్షణ ఇస్తున్నారు. నగరంలో జ్ఞానాపురంలో సెయింట్ జోసెఫ్ కాలేజీ ఫర్ ఉమెన్స్ నూతన విద్యా విధానం (హయ్యర్ ఎడ్యుకేషన్ పాలసీ)లో భాగంగా దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌తో ఈ ఏడాది ఒప్పందం కుదుర్చుకొంది. ఈ ఒప్పందం ప్రకారం మూడేళ్ల వరుసగా ఆ కళాశాలలో హోం సైన్స్ విద్యార్థినులకు శిక్షణ ఇస్తారు. దీని ప్రకారం ఈ కళాశాలలో బీఎస్సీలో హోం సైన్స్ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఇంటెర్న్‌షిప్‌లో భాగంగా 40 రోజులు నుంచి మూడు నెలలు కాల పరిమితితో వివిధ చేతి వృత్తుల్లో శిక్షణ పొందుతున్నారు. ఇప్పటి వరకు రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో టెక్స్‌టైల్స్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్‌లో 21 మందికి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం బీఎస్సీ రెండో సంవత్సరం విద్యార్థినులు 26 మందికి డ్రెస్ డిజైనింగ్‌లో రెండో బ్యాచ్ శిక్షణ ఇస్తున్నారు. ఈ బ్యాచ్ శిక్షణ ఈనెల 11తో ముగియనుంది. ప్రస్తుతం జరుగుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కుర్తా, పైజమా, టీ-షర్ట్స్, చుడీదార్, పెట్టీకోట్, జాకెట్లు, గౌన్లు, కాటన్ బ్యాగులు తదితర వాటిని తయారు చేయడంలో ఇన్‌స్ట్రక్టర్లు శిక్షణ ఇస్తున్నారు. 40 రోజుల శిక్షణలో థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నారు.

నేడు వస్త్ర ప్రదర్శన..



దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన రెండో బ్యాచ్ శిక్షణ ఈనెల 11తో ముగియనుంది. ఈ సందర్భంగా ఈ శిక్షణలో విద్యార్థినులు తయారు చేసిన వస్తువులను ఆదివారం ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో ప్రదర్శన, విక్రయం జరపనున్నాం. ఆసక్తిగలవారు కొనుగోలు చేసుకోవచ్చు. ఇన్‌స్ట్రక్టర్లు రాధాకుమారి, ఛాయాదేవి, లక్ష్మి, వెంకటరత్నం డ్రెస్ డిజైనింగ్‌లో విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు.

-వి.దక్షిణామూర్తి, ఇన్‌చార్జి, దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్,



విద్యార్థులు కుట్టిన గౌను



టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

'రక్షణ రంగాన్ని పటిష్ట పరిచింది ప్రధాని మోదీయే'



సమావేశంలో మాట్లాడుతున్న గొర్లె రామునాయుడు

సింహాచలం: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాటు అందించిన సుపరిపాలనలో భారతదేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని బీజేపీ పెందుర్తి నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పెందుర్తిలో బీజేపీకి చెందిన పలు మోర్చాల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. దేశంలో రక్షణ రంగాన్ని పటిష్టపరిచిన ఘనత మోదీదే అన్నారు. అంతర్జాతీయంగా భారతదేశానికి ఎనలేని కీర్తిప్రతిష్టలను ఆయన తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.వెంకట సన్యాసిరావు, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు భూపతి అప్పారావు, పెందుర్తి రూరల్ అధ్యక్షుడు కళ్ల జగన్‌మోహన్, వేపగుంట మండల అధ్యక్షుడు జయరాజు, 93వ వార్డు ప్రధాన కార్యదర్శి కల్యాణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్, నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు లారీల రాకపోకలతో తీవ్ర కాలుష్యం

- చర్యలు తీసుకోవాలని సింహాద్రి కూడలి వద్ద సీఐటీయూ రాస్తారోకో



సింహాద్రి కూడలి వద్ద రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

పరవాడ: కాలుష్యానికి కారణమైన హిందూజా బొగ్గు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సింహాద్రి కూడలి వద్ద కార్యకర్తలు శనివారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ హిందూజా పవర్ ప్లాంటుకు రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీల కారణంగా రహదారులు ధ్వంసం కావడమే కాకుండా ఇళ్లు మసిబారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు లారీలను సిబ్బంది నిర్లక్ష్యంగా నడపడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయన్నారు. వీటిని ఎక్కడికక్కడ రోడ్లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్ల ప్రజా రవాణా వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు లారీలు, బూడిద లారీల రాకపోకల వల్ల సబ్బవరం, లంకెలపాలెం, పరవాడ, కలపాక గ్రామాలు పూర్తిగా కాలుష్యంలో చిక్కుకుని, అక్కడి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని వాపోయారు. ఈ లారీలు విడుదల చేస్తున్న కాలుష్యం కారణంగా ద్విచక్ర వాహనచోదకులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న బొగ్గు లారీల రాకపోకలపై రవాణా శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. రవాణా వ్యవస్థకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్న ఈ లారీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.నాగప్పారావు, ఎస్.సత్తిబాబు, ఎస్.అప్పారావు, రమణ, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఖాళీల భర్తీ

- దరఖాస్తు గడువు ఈ నెల 14
- 17న ప్రవేశ పరీక్ష



అప్పలనాయుడు, ప్రిన్సిపాల్

పరవాడ: మండలంలోని తానాం మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు గల ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ మీసాల అప్పలనాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ జిల్లాలోని సింహాచలం, పెదనరవ బాలురు, అన్నవరం బాలికలు, అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం బాలురు, తానాం, చోడవరం, పాయకరావుపేట బాలికల పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. దరఖాస్తులు ఆయా పాఠశాలల్లోనే ఈ నెల 12 నుంచి 14 వరకు పొందవచ్చన్నారు. దరఖాస్తులను పూర్తి చేసి, ఈ నెల 14 తేదీలోగా ఆయా పాఠశాలల్లో అందజేయాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 17న సింహాచలం గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభించిన తర్వాత కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు

సింహాచలం : జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పురుషోత్తపురంలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రైమరీ ఆరోగ్య కేంద్రం భవనానికి రూ.14 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మంగా చేపట్టిన వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల ద్వారా ప్రజలకు మరింత చేరువగా వైద్యం అందుతోందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పురుషోత్తపురంలో ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఇటీవల భవనానికి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. పనులు త్వరలోనే పూర్తి చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జొన్నాడ సాయికృష్ణ, సచివాలయం కన్వీనర్లు గోకివాడ బుజ్జి, విజయేంద్ర కృష్ణ, రమణమూర్తి, సంతోష్, చీర రాజు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రావాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి పూజలు



రావాలమ్మ ఆలయ నిర్మాణంలో భాగంగా పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తదితరులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామ దేవత రావాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులను శనివారం వైభవంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి మండల పరిషత్ సాధారణ నిధుల నుంచి రూ.4 లక్షలు కేటాయించగా, ఎమ్మెల్యే సొంతంగా లక్ష రూపాయలు అందజేయనున్నట్లు ప్రకటించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పాడేరు నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ రూ.2 లక్షలు అందజేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ బోను దేవుడమ్మ, ఎంపీటీసీ కనకరాజు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, బోకం రామునాయుడు, బోను గంగునాయుడు, ఐడీ బాబు, కోటాన వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత ప్యానెల్ విజయం

ప్రశాంతంగా భెల్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఎన్నికలు



విక్టరీ సింబల్ చూపుతున్న ఐక్యత ప్యానెల్ నాయకులు, సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో ఐక్యత ప్యానల్ విజయం సాధించింది. ఎన్నికల్లో జై భీమ్ ప్యానల్ గట్టి పోటీ ఇచ్చింది. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంస్థ ట్రైనింగ్ సెంటర్, హెచ్‌ఆర్‌డీసీలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 162 ఓట్లు ఉండగా 129 ఓట్లు పోలయ్యాయని, ఇందులో చెల్లని ఓట్లు 20గా గుర్తించినట్లు ఎన్నికల అధికారులు కె.పి.మిశ్రా, రాజేంద్రబాబు తెలిపారు. ఎన్నికల ఫలితాలను రాత్రి 7.30 గంటల తర్వాత ప్రకటించారు. విజయం సాధించిన ఐక్యతా ప్యానల్ అంబేడ్కర్ పార్క్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని, పూలమాలలు వేశారు.

విజేతలు వీరే..

ఐక్యత ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా పోటీ చేసిన జి.కిరణ్‌కు 70 ఓట్లు రాగా జై భీమ్ ప్యానల్ అభ్యర్థి టి.రవికుమార్‌కు 56 ఓట్లు వచ్చాయి ఇందులో చెల్లని ఓట్లు 3 ఉన్నాయి. ప్రధాన కార్యదర్శిగా ఐక్యతా ప్యానల్ అభ్యర్థి కొల్లి దేముడుకు 73 ఓట్లు రాగా, జై భీమ్ అభ్యర్థి జె.రామ చంద్రరావుకు 55 ఓట్లు వచ్చాయి. ఇందులో చెల్లని ఓటు 1 ఉందన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.ఆర్.కె.దాస్, ఉపాధ్యక్షులుగా టి.సాంబశివరావు, కె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా డి.సాయిబాబు, పి.సురేష్, కోశాధికారిగా జి.సంజీవరావు విజయం సాధించారు. ఐక్యతా ప్యానల్‌లో సంయుక్త కార్యదర్శిగా బి.రాజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'చంద్రంపాలెం'లో చురుగ్గా అడ్మిషన్లు

మధురవాడ: నగరంలోని చంద్రంపాలెం (మధురవాడ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్స్ ఉత్సాహంగా సాగుతున్నాయి. రాష్ట్రంలోనే పెద్దది అయిన ఈ పాఠశాలలో పిల్లలను చేర్పడానికి తల్లిదండ్రులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. పాఠశాల ప్రారంభం కాకముందే ఇక్కడి ఉపాధ్యాయులు రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అడ్మిషన్స్ నమోదు చేస్తున్నారు. శనివారం నాటికి వారం రోజుల్లోనే 200 మంది చేరారు. వీరిలో 180 మంది 6వ తరగతిలోనే చేరినట్టు ప్రధానోపాధ్యాయులు ఎమ్.రాజబాబు, జయప్రద చెప్పారు. విద్యార్థులను చేర్చుకోవడానికి ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్టు ప్రధానోపాధ్యాయులు చెప్పారు.